పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి

- మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో పర్యటించిన కేంద్ర కరువు బృందం సభ్యులు
- బాధిత రైతులతో ముఖాముఖి
- ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు


పరిగి: వినతిపత్రాన్ని అందిస్తున్న డీఏఏబీ చైర్మన్ అవుటాల రమణారెడ్డి

మడకశిర రూరల్: మడకశిర మండలంలో బుధవారం కేంద్ర కరువు బృందం సభ్యులు పర్యటించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ అండ్ మానిటరింగ్ అప్రైజల్ పీ దేవేంద్రరావు, ఎంఎన్‌సీ ఎఫ్‌సీ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అనిమల్ హస్బెండర్ డెయిరింగ్ రీజనల్‌ఫాడర్‌స్టేషన్ ఎస్‌టీఏ అంజు బసేరా బృందం సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామితో కలిసి బుళ్లసముద్రం వద్ద మహిళా రైతు లక్ష్మీదేవమ్మ, హరేసముద్రం గ్రామంలో రైతు వెంకోబప్ప వేరుశనగ పంటలో అంతర్ పంటగా సాగు చేసిన కంది పంటను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి ద్వారా పంటల పరిస్థితిని, భూగర్భ జలాల నీటి మట్టం, మంచి నీటి ఎద్దడి తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. మహిళా రైతు లక్ష్మీదేవమ్మ లక్ష్మీదేవమ్మ సర్వే నంబర్ 86–1ఏ విస్తీర్ణంలో 1.95 ఎకరాల్లో రూ.60 వేలు ఖర్చు పెట్టి ఖరీఫ్ వేరుశనగ పంట సాగు చేశాను వర్షా భావ పరిసితుల కారణంగా పంట తీవ్రంగా దెబ్బతిన్ని నష్టపోయామని బృందం సభ్యులకు తెలిపారు.

- హరేసముద్రం గ్రామానికి చెందిన రైతు వెంకోబప్ప మాట్లాడుతూ కొంత భూమి రైల్వేలైన్‌కు పోయిందని ఉన్న భూమిలో పంట సాగు చేసుకున్న వర్షాలు పడకపోవడంతో పంట చేతికందక తీవ్రంగా నష్టపోయామని బృందం సభ్యులకు వివరించారు.
- కదిరేపల్లి రైతు భరోసా కేంద్రంలో జిల్లా స్థాయిలో దెబ్బతిన్న వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటల ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు.
- పట్టు రైతు సంఘం నాయకులు, బీజేపీ కిసాన్ మోర్చా రాయలసీమ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ పట్టు రైతుల సమస్యలు, పంట నష్టపోయిన రైతులకు సాయం అందించి అందుకోవాలని బృందం సభ్యులకు వినతిపత్రం అందజేశారు.

గుడిబండ: మండల పరిధిలోని జంబులబండలో రైతు బాలకృష్ణ పొలంలో వేరుశనగ, కంది పంటను కేంద్ర కరువు బృందం బుధవారం పరిశీలించింది. ఖరీఫ్ సీజన్‌లో రూ.30 వేలు ఖర్చు చేసి పంట వేసినా వర్షాభావం వల్ల పంట చేతికందలేదని బాధిత రైతులు వాపోయారు. ఆదుకోవాలని విన్నవించారు. గుడిబండ గ్రామంలోనూ కేంద్ర బృందం పర్యటించింది. రైతు మంజన్న పొలంలో కంది పంటను పరిశీలించారు.

ఉపాధికి అనుసంధానం చేయండి

అమరాపురం: మండలంలోని వలస గ్రామ పొలంలో నెలకొన్న కరువు పరిస్థితులను బుధవారం కేంద్ర కరువు బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు పి.దేవేంద్రరావు, పరదీప్‌కుమార్, అంజుబసేరాలు వలస గ్రామంలోని సర్వే నెంబర్ 210–2 లోని 2 ఎకరాల్లో సాగు చేసిన వేరుశనగ, కంది పంటలను పరిశీలించారు. బాధిత రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. జాతీయ ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలని రైతులు బృందం సభ్యులకు మొరపెట్టుకున్నారు. ఇక్కడ ఏర్పడిన కరువు పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నివేదిక సమర్పిస్తామని అధికారులు రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ డీఏఓ సుబ్బారావు, ఏడీఏ కృష్ణమీనన్, కృష్ణయ్య, పశు సంవర్ధకశాఖ హెచ్ఓ. డీహెచ్‌ఓలు చంద్రశేఖర్, సిరికల్చర్ సీపీఓ విజయ్‌కుమార్, డీవైఎస్ఓ మల్లికార్జున, ఏఓ.మంజునాథ, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ మునిస్వామి, సర్పంచ్ నాగవేణి, ఎంపీపీ ఈరన్న, జడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క పాల్గొన్నారు.

మిగిలిన మండలాలను ఆదుకోండి

పరిగి: జిల్లాలో 32 మండలాలకుగానూ 22 మండలాలను కరువు మండలాలుగా గుర్తించారని, మిగిలిన 11 మండలాలకు తగిన సాయం అందించాలని జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి కోరారు. జిల్లా పర్యటనలో భాగంగా పరిగి మండలంలోని మోదాలో పంట పరిశీలనకు వచ్చిన కేంద్ర కరువు బృందం సభ్యులను ఆయన కలిసి, పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన వినతిపత్రాన్ని అందించారు. జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించి ఆదుకోవాలన్నారు.

సబ్ కెనాల్ నిర్మించండి



దేశంలోనే రాజస్తాన్ తరువాత పరిగి మండలం తీవ్ర కరువు మండలంగా గుర్తించారు. ఈ ప్రాంతంలోని ప్రజలంతా వ్యవసాయ ఆధారిత కుటుంబాలే. మడకశిర బ్రాంచ్ కెనాల్ మండలంలో ఉన్నప్పటికీ కొన్ని చెరువులకు చుక్క నీరు కూడా చేరే పరిస్థితి లేదు. ప్రధాన కాలువకు సబ్ కెనాల్‌ను నిర్మిస్తే మోదా, చెర్లోపల్లి తదితర చెరువలకు కృష్ణా జలాలు చేరుతాయి. దీనికోసం కేంద్రం రాష్ట్రానికి నిధులు కేటాయించాలి. **- మారుతీరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు**

నష్ట నివారణకు కృషి చేయండి



రైతు బాగున్నప్పుడే దేశం బాగుంటుంది. ఏదైనా విపత్తు సంభవిస్తే రైతుకు జరిగిన నష్టాన్ని నివారణకు కృషి చేయాలి. తీవ్ర వర్షాభావంతో కనీస సాగు చేయలేక, సాగు చేసిన పంట చేతికందక రైతులు పడుతున్న అవస్థలను గుర్తించి, కేంద్ర కరువు బృందం సభ్యులు సానుకూల నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలి. లేకపోతే వలసలు తప్ప వేరే దారిలేదు. **- నారాయణరెడ్డి, ఎంపీటీసీ, మోదా**

క్లుప్తంగా

వెంకటరమణుడికి ప్రత్యేక పూజలు


స్వామివారి పట్టు వస్త్రాలను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపికకు అందిస్తున్న అర్చకులు

హిందూపురం: పట్టణంలోని పేట వెంకటరమణ స్వామి ఆలయంలో హిందూపురం నియోజకర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎన్.దీపిక ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయంలో మూలవిరాట్ వెంకటరమణస్వామికి ప్రత్యేక అర్చనలు, పూజలు జరిపించారు. నియోజకవర్గంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నామని చెప్పారు. అనంతరం వేదపండితులు సమన్వయకర్త దీపికకు పట్టువస్త్రాలు అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగేంద్ర బాబు, కాణిపాక వినాయక ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు రవీంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు భగీరథ నవీన్, వేణుగోపాల్, రవికుమార్, గోపాల్, ప్రవీణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయండి

రొద్దం: మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో ఈనెల 15 నుంచి నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను కార్యక్రమం విజయ వంతం చేయాలని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు తప్పక పాల్గొనాలని కోరారు.

వాహనం ఢీకొని కృష్ణ జింక మృతి



రొళ్ల: మండల పరిధిలోని ఆవినకుంట గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని కృష్ణ జింక మృతి చెందిన ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే... ఆవినకుంట అటవీ ప్రాంతంలోని మూడు నాలుగేళ్ల వయస్సున్న కృష్ణ జింక ఆహారం కోసం గ్రామాల వైపు వచ్చింది. రొళ్ల, మడుడికి వెళ్లే ప్రధాన రోడ్డును దాటే క్రమంలో గుర్తు తెలియని వాహనం కృష్ణ జింకను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన జింక సమీపాన పొలంలోకి వెళ్లి మృతి చెందింది. ఉదయాన్నే అటుగా వెళ్లిన అదే గ్రామానికి చెందిన డాక్టర్ వెంకటరమణప్ప కృష్ణ జింక మృతి చెందిన విషయాన్ని సంబంధిత అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని కృష్ణ జింక కళేబరాన్ని పరిశీలించారు. తర్వాత పశువైద్యాధికారులచే కృష్ణ జింకకు పోస్టుమార్టం నిర్వహించి రొళ్లకొండ సమీపంలోని అటవీశాఖ నర్సరీ వద్దకు తీసుకెళ్లి దహనం చేశారు. పోస్టుమార్టం ఆధారంగా విచారణ చేపడతామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

క్రీడాకారులకు ప్రోత్సాహకాలు


రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న ముగ్గురు విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు బసవరెడ్డి ప్రోత్సాహక బహుమతులను అందించారు. గుట్టూరు ప్రభుత్వ హైస్కూల్ నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న లతీష్, కీర్తన, పవన్‌కు స్థానిక రిటైర్డు ఉపాధ్యాయుడు బసవరెడ్డి బ్యాగ్‌లను బహూకరించారు. మిగిలిన 500 మంది విద్యార్థులకు పెన్నులను అందచేసినట్లు ప్రధానోపాధ్యయుడు నాగార్జునుడు తెలిపారు.

ఆలయ స్థలం గుర్తింపునకు సర్వే


సర్వే ప్రక్రియను వివరిస్తున్న తహసీల్దార్ వరదరాజు

పావగడ: స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్ద నీలకంఠేశ్వరస్వామి దేవాలయం స్థలాన్ని గుర్తించేందుకు బుధవారం ఆ ప్రాంతంలో అధికారులు సర్వే నిర్వహించారు. అక్కడ నీలకంఠేశ్వర స్వామి ఆలయ ఆనవాళ్లు లేవని కేవలం కన్యకా పరమేశ్వరి దేవాలయం మాత్రమే ఉందని తహసీల్దార్ వరదరాజు తేల్చారు. అయితే గుడిలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఫిర్యాదు దారుడు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా సంఘటనా కార్యదర్శి ఎస్ రామాంజినప్ప ఆరోపించారు. నీలకంఠేశ్వరస్వామి ఆలయం గుర్తింపు కోసం న్యాయ పరమైన చర్యలు చేపడతామని రామాంజినప్ప తెలిపారు.

చెప్పిందే చేస్తాడు... చేసేదే చెప్తాడు

- హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



హిందూపురం: గృహ సారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక

హిందూపురం: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను మేనిఫెస్టోలో పొందుపరచి తూచా తప్పకుండా హామీలను నెరవేర్చి సీఎం వైఎస్ జగన్ నవశకానికి నాంది పలికారు. మరోసారి ఆయనకే ప్రజలందరూ పట్టం కట్టాలి ' అని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా 17వ వార్డు సచివాలయం వద్ద కౌన్సిలర్ మాజన్ అధ్యక్షతన ఏబ్లాక్ కన్వీనర్ సాధిక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సమన్వయకర్త టీఎన్.దీపిక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించి వార్డు సచివాలయ పరిధిలో నాలుగున్నర ఏళ్లలో రూ.15,73,38 190 ప్రజలకు లబ్ధి చేకూరిన బోర్డును ప్రారంభించారు. ఎన్నికల సమయంలో అమలు చేయని హామీలు గుప్పించడం తీరా గెలిచగా మేనిఫెస్టోను మాయం చేయడం టీడీపీకి పరిపాటిగా మారిందని విమర్శించారు. సీఎం జగనన్న గెలిచినప్పటి నుంచి నేటి దాకా ఇచ్చిన హామీల్లో వందకు 99 శాతం పూర్తిచేసి నిజాయితీని చాటుకున్నారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పిందే చేస్తాడు... చేసేదే చెప్తాడని వివరించారు.

చంద్రబాబును నమ్మొద్దు

2024లో టీడీపీ అధినేత చంద్రబాబు బూటకపు హామీలతో అబద్దాల మాటలతో ప్రజలను మభ్య పెట్టేందుకు తోక పార్టీలతో కలిసి వస్తున్నారని, అలాంటి వారిని నమ్మవద్దని దీపిక సూచించారు. నిన్ను నమ్మం బాబు... జగనన్నే మా నమ్మకం అని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మహేంద్ర, కౌన్సిలర్లు షాజియా, ఇర్షద్‌అహ్మద్, ఆసీఫ్, మల్లికార్జున, రోషన్, ఆయుబ్, రహమత్‌బీ, జేసీఎస్ కన్వీనర్ నౌషాద్, నాయకులు షఫీ, హబీబ్, మహేష్, దాదు, నాగరాజు, చాందు, భారతీ, కవిత, బాను, షాజహాన్, రవీంద్ర, మస్తాన్, ఆనంద్‌రెడ్డి, జావిద్, శ్రీన, ఈశ్వర్‌రెడ్డి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: 'బడుగు, బలహీన వర్గాల వారితో పాటు మైనార్టీలు, వెనుకబడిన ఉన్నత కులాల వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను వారి ఇంటికే చేర్చారు. అలాంటి జగనన్నను మరోసారి ప్రజలందరూ ఆశీర్వదించాలి' అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ , ఎంపీపీ ఈరన్న,జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని తమ్మడేపల్లి గ్రామ సచివాలయం 2 పరిధిలోని గౌడనకుంటలో సర్పంచ్ గిరిజమ్మ అధ్యక్షతన 'వై ఏపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. అలాగే గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరిజమ్మ, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, వైస్ ఎంపీపీలు లలిత, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తరువాత పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. పేదలు మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప పేర్కొన్నారు. మండలంలోని పులేరు సచివాలయ పరిధిలో బుధవారం పులేరు, వెంకటరమణపల్లి సర్పంచులు ప్రభాకారరావు, అశ్వర్థరెడ్డి నేతృత్వంలో లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు బాషా, పూలేరు ఉప సర్పంచ్ శ్రీనివాసులు, సచివాలయ మండల కన్వీనర్ నరసింహరెడ్డి, సచివాలయ కన్వీనర్లు చౌడిరెడ్డి, హనుమంతరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నార్సిరెడ్డి, సంపత్ డీలర్ కిష్టప్ప, ఈశ్వరయాదవ్, మధుసూదనరెడ్డి, ఫిరోజ్‌ఖాన్, సురేంద్రరెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని మద్దనకుంటలోని సచివాలయ ఆవరణంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం సర్పంచ్ జగదాంబ క్రిష్టప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సింగల్ విండో అధ్యక్షుడు చంద్ర మాట్లాడుతూ పేదల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి సంక్షేమ పాలన అందిస్తోందని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని జేసీఎస్ మండల కన్వీనర్ శివకుమార్ పేర్కొన్నారు. ఎంపీటీసీ సుశీల మాట్లాడుతూ ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఒక్క సీఎం జగన్‌కే దక్కుతుందని ప్రజలంతా మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు.


అమరాపురం మండలం గౌడనకుంటలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు


గోరంట్ల మండలం పూలేరులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


గుడిబండ: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పోటీలను పకడ్బందీగా నిర్వహించండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయం సిబ్బంది, పీడీలు, హెచ్ఎంలతో ఎంఈఓ– 2 వెంకటరమణనాయక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని గ్రామ సచివాలయ పరిధిలో పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న యువతీ యువకులకు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలు ఏ విధంగా నిర్వహించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విజేతలను ఏ విధంగా నిర్ణయించాలి తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగముని, సచివాలయం అధికారులు, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన హెచ్ఎంలు, పీడీలు పాల్గొన్నారు.

అందరికీ శుద్ధజలం అందించడమే లక్ష్యం


మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

- వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంకరనారాయణ

పరిగి: అందరికీ శుద్ధ తాగునీటిని అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన పరిగిలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రధాన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత ఆయనకు మండల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో పాటూ ప్లాంట్ నిర్వాహకుడు ఓబులేసు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్లాంట్‌ను ప్రారంభించి స్విచ్ ఆన్ చేశారు. ప్లాంట్‌లోని ప్రతి పరికరాన్ని పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడకుండా మండల ప్రజలకు మంచి నీటిని సరఫరా చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా వాటర్ సరఫరా ట్యాంకర్ ట్రాక్టర్‌ను నడిపి అందరినీ ఆశ్చర్య పరిచారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీపీ సవిత, వైస్ ఎంపీపీ వేదవతి, శకుంతలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, ఎంపీటీసీలు లక్ష్మీ, లింగమ్మ, మారుతీరెడ్డి, చిక్కన్న, వైస్ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మంచి పేరు తెద్దాం

- మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ ఫిర్దోస్‌భాను


సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ ఫిర్దోస్‌భాను

హిందూపురం అర్బన్: 'హిందూపురం వ్యవసాయ మార్కెట్ చింత, ఎండు మిర్చికి పెట్టింది పేరు. చింత పండు సీజన్ త్వరలో ప్రారంభం కానుంది. రైతులు, వ్యాపారులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా అందరూ పనిచేయాలి' అని మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ ఫిర్దోస్‌భాను, వైస్ ప్రెసిడెంట్ మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ నూతనంగా బాధ్యతలు చేపట్టిన తరువాత బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో తొలిసారి సమావేశమైంది. ప్రధానంగా రైతులకు విశ్రాంతి గది, సీజన్‌లో మార్కెట్‌లో అల్పాహారం, తాగునీటి సౌకర్యం , మరుగుదొడ్ల ఏర్పాటు కల్పించడమే కాకుండా ఈ నామ్‌ద్వారా చింత, మిర్చి కొనుగోలు చేసే సమయంలో ఎలాంటి నిబంధనలు పాటించాలన్న దానిపై చర్చించారు. మార్కెట్‌లో క్రయ, విక్రయాలు, చింత పండు, మిర్చిపై కమిషన్ తూకాల గురించి సమీక్షించారు. మార్కెట్‌లో గత రెండేళ్లగా వచ్చిన ఉత్పత్తులు, మార్కెట్‌కు వచ్చిన ఆదాయ వివరాలను మార్కెట్ కార్యదర్శి కిశోర్ వివరించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

సెబ్ విస్తృత దాడులు

హిందూపురం టౌన్: సెబ్ స్టేషన్ పరిధిలో విస్తృత దాడులు నిర్వహించి అక్రమ మద్యం, ఇసుక, మట్కా కేసుల్లో పలువురిని అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ శ్రీధర్ తెలిపారు. సెబ్ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఈ నెల 11వ తేదీ నుంచి 13 వరకూ కర్ణాటక మద్యం కేసులు 13 నమోదు చేసి, 890 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి 13 మందిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే మూడు మట్కా కేసులను నమోదు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.49,740ను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే పరిగి మండలంలో ఒక ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి 4 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో ఒకరిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరించండి

హిందూపురం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ ఉద్యోగులు బుధవారం డిపో ఎదుట ఎస్‌ఎంయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎంయూ రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అప్పీల్స్ పరిష్కరిస్తూ మెడికల్‌లీవ్ అందరికీ వర్తింపజేయాలని చెప్పారు. గ్యారెజీలో ఖాళీలు భర్తీచేసి ప్రమోషన్లు కల్పించాలన్నారు.

సర్వర్ సమస్య పరిష్కరించండి


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

హిందూపురం టౌన్: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సర్వర్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. సర్వర్ సమస్యను త్వరితగతిన పరిష్కరించి రిజిస్ట్రేషన్ సేవలను సత్వరమే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర నాయకులు శ్రీరాములు, నాజీం బాషా, సుబ్బరాయప్ప, నారాయణ, చిరంజీవి, నాగరాజు స్వామి, ఈశ్వరయ్య, గంగప్ప పాల్గొన్నారు.

అక్షింతల పంపిణీకి ఏర్పాట్లు


అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలను బియ్యంలో కలుపుతున్న దృశ్యం

పావగడ: ఇటీవల అయోధ్య నుంచి పావగడకు తీసుకు వచ్చిన అక్షింతలను తాలూకా వ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ అందించడానికి స్థానిక శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. కోటి ఆంజనేయస్వామి దేవాలయంలో మహిళా భక్తులు అక్షింతలను బియ్యంలో కలిపే ప్రక్రియలో పాల్గొన్నారు. అక్షింతలను వచ్చేనెల ఒకటవ తేదీ నుంచి పంపిణీ చేస్తామని ట్రస్ట్ పదాధికారులు తెలిపారు.

15న విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

మడకశిర: మండలంలో నిర్వహించే విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎంఈఓ భాస్కర్ ఉపాధ్యాయులను కోరారు. ఈనెల 15న పాఠశాల, 16న మండలస్థాయిలో ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత, సైన్స్ ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పట్టణంలోని మాతా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఈనెల 16న మండలస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జరుగుతుందన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. అక్రమ పట్టాలు పొందారని కొంతమందిపై ఆర్టీఐ కార్యకర్త బాబు ప్రసాద్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. అయితే దళితులను సమాచార హక్కు చట్టం పేరిట బాబు ప్రసాద్ బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని, కులం పేరుతో దూషించినట్లు వారు ఫిర్యాదు చేశారు. అక్రమాలను ప్రశ్నిస్తే తనపై దాడికి దిగి చంపడానికి ప్రయత్నం చేశారని బాబు ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురు ఫిర్యాదులపై విచారణ జరుపుతున్నామని ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి సచివాలయం ఆవరణలో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తొలిసారి అతిపెద్ద యూత్ ఫెస్టివల్

- విజయవంతం చేయాలన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అతి పెద్ద ఎత్తున యూత్ ఫెస్టివల్ నిర్వహించబోతున్నారని హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. క్రీడాకారులను పోత్సహిస్తూ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వారిలో ప్రతిభను వెలికి తీసేందుకు ఈనెల 15 నుంచి 50 రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హిందూపురం నియోజకవర్గంలోని క్రీడాకారులు ఎంతో ప్రతిభ ఉన్న వారు ఉన్నారని, వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడా స్ఫూర్తిని చాటిచెప్పాలని పిలుపునిచ్చారు.